

పాడి రైతులకు ప్రత్యేక పశు విజ్ఞాన బడి



పశువులకు ఫీడ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పీలేరు: ప్రభుత్వం పాడి రైతుల కోసం ప్రత్యేకంగా పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని, పాడి రైతులు దాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎ.ఇ ప్రదీప్ కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రెడ్డివారిపల్లెలో మంగళవారం పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆర్‌బికె పరిధిలోని పశువులను పరీక్షించేందుకు 15 రోజులకు ఒకసారి ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని చేపడతామని, పశువులను పరీక్షించి, వాటికి సోకిన వ్యాధుల గురించి మందులు అందజేస్తామన్నారు. పశుపోషకుల అవసరాలకు 6,700 కిలోల జొన్న, 8,600 కిలోల మొక్కజొన్న విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆసక్తిగల రైతులు వాటికోసం తమ సమీపంలోని ఆర్.బి.కెలను సంప్రదించాలన్నారు. 5 కేజీల జొన్న విత్తనాలు సబ్సిడీలో పోను రూ.115, మొక్కజొన్న విత్తనాలు 5 కిలోల కిట్ రూ.85 అని ఆయన తెలిపారు. అనంతరం ఆయన రెడ్డివారిపల్లెలోని 30 పశువులకు వివిధ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బోడిపాపలి, మండల వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రత్నశేఖర్ రెడ్డి, విఎఎ హేమంత్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాలు అధిగమించాలి : కలెక్టర్



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాజంపేట

జిల్లాలో నిర్దేశించిన మేరకు గృహ నిర్మాణ లక్ష్యాలను అధిగమించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ గిరీష అన్నారు. మంగళవారం మండలంలోని పులపుత్తూరు, ఎస్‌సి కాలనీలో ఇళ్ల నిర్మాణాల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజల ద్వారా అడిగి తెలుసుకొని అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వారం లోపల 30 ఇళ్లు రూఫ్ లెవల్‌కి తీసుకొని రావాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలు ఎప్పటిలోగా పూర్తి చేస్తారు, ఏఏ దశలలో పనులు జరుగుతున్నాయి వాటి వివరాలను అడిగి తెలుసుకొని జూన్ 20లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం కల్లా 60 మందికి ఇంటి పట్టాలు ఇవ్వాలని తాహశీల్దార్‌ను ఆదేశించారు. శ్మశానం, దేవాలయంకు స్థలం చూపించారా లేదా అని గ్రామస్తులను కలెక్టర్ అడగగా, స్మశానం, దేవాలయానికి స్థలం చూపించారని కలెక్టర్ ఎదుట గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. వీధి లైట్లు వచ్చే మంగళవారం లోపు అమర్చాలని ఏపిఎస్ పిడిసిఎల్ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. 30 ఇళ్లలో గోడల దశలలోకి చేరుకున్నాయి, పది రోజుల నుంచి ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఒకటి కూడా బిల్లు ఎందుకు పెట్టలేదని గృహ నిర్మాణ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడిసెలో ఉండే వారి బాధను అర్థం చేసుకొని త్వరగా వారి ఇళ్లను పూర్తి చేసి అప్పగించాలన్నారు. ఇళ్ల నిర్మాణాల వేగవంతం కోసం కూలీల సంఖ్యను గణనీయంగా పెంచుకోవాలన్నారు. మంచి నీరు త్వరగా ఇవ్వాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. స్టోరేజ్ ట్యాంకుల పనులను త్వరగా ప్రారంభించాలన్నారు. సొంతంగా ఇళ్లు నిర్మించుకొనే వారికి ఇప్పుడు ఇచ్చిన రుణం కన్నా ఇళ్ల నిర్మాణం కోసం అదనంగా రూ.15 వేలు ఇవ్వాలని ఏపిఎంను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పనులు కూడా కల్పించాలన్నారు. మళ్లీ వచ్చేవారం విజిట్ చేస్తానని ఆలోగ పనులన్నీ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ భాస్కర్, హౌసింగ్ పీడీ శివయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రసన్న కుమార్, తహశీల్దార్ సుబ్రహ్మణ్యంరెడ్డి, విద్యుత్ ఎఇ ఈశ్వర్ రాజు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారంలోకొస్తే.. 'ఉక్కు' పరిశ్రమ

- మినీ మేనిఫెస్టోతో వైసిపిలో వణుకు
- జమ్మలమడుగు బహిరంగ సభలో లోకేష్
- యువగళం సభకు పోటెత్తిన జనం



బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

అధికారంలోకి వస్తూనే ఉక్కు పరిశ్రమను నిర్మిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 111వ రోజుకు చేరుకుంది. మంగళవారం వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగు విడిది కేంద్రం నుంచి పెద్దపసుపుల మోటు, సంజామల మోటు, కన్నెలూరు, ధర్మవరం, శేషారెడ్డిపల్లె, దేవగుడి విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగుగింది. ఆయా ప్రాంతాల్లో ప్రజలతో మాటామంతి నిర్వహించారు. జమ్మలమడుగులో నిర్వహించిన బహిరంగ సభ నిర్వహించారు. సభకు భారీ స్థాయిలో జనం పోటెత్తడంతో జమ్మలమడుగు జనసంద్రంగా మారింది. పాత బస్టాండ్ నుంచి సంజామల మోటు వరకు సభలో జనం పోటెత్తారు. జనాన్ని చూసి లోకేష్ భూపేష్ లోకేష్‌ల జోడి అదిరిందని చెప్పడంతో ప్రజలు ఈలలు, కేకలు వేశారు. ఈ సందర్భంగా సభలో లోకేష్ మాట్లాడుతూ మహానాడులో మినీ మేనిఫెస్టోతో వైసిపిలో వణుకు మొదలైందన్నారు. మహానాడులో భవిష్యత్‌కు గ్యారెంటీ పేరుతో వచ్చిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. జగన్ మోహన్‌రెడ్డి మోసగాడని ఎద్దేవా చేశారు. జగన్ రైతులు లేని రాజ్యం తెస్తున్నాడన్నారు. జగన్ ఉద్యోగస్తులను, టీచర్లను మద్యం దుకాణాల ముందు నిలబెట్టి అవమానించాడన్నారు. బెంగుళూరులో ప్యాలస్, హైదరాబాద్‌లో ప్యాలస్, తాడేపల్లి లో ప్యాలస్, ఇడుపులపాయలో ప్యాలస్, ఇప్పుడు వైజాగ్‌లో మరో ప్యాలస్ కడుతున్నాడు ఇన్ని ప్యాలస్‌లు ఉన్నవాడు పేదవాడా? అని ప్రశ్నించారు. మోసగాడు జగన్ కట్టింగ్ అండ్ ఫిట్టింగ్ మాస్టర్ అని ఛలోక్తులు చేశారు. జగన్ ఏకంగా సొంత బాబాయ్‌నే లేపేసాడని, ఇప్పుడు సిబిఐ జగన్ అండ్‌కో బండారం బయటపెట్టిందన్నారు. రహస్య సాక్ష్యంతో వణికిపోయి జగన్ ఢిల్లీ పరిగెత్తి ఢిల్లీ పెద్దల కాళ్లు పట్టుకున్నాడని తెలిపాడు. బీసీలను, దళితులను, మైనారిటీ, రెడ్డి సామాజిక వర్గాన్ని జగన్ మోసం చేశాడని వీరందరికి రక్షణగా టిడిపి ఉంటుందన్నారు. 2019 ఎన్నికల్లో జమ్మలమడుగు జాతకం మార్చేస్తాడని భారీ మెజారిటీతో మూలె. సుధీర్‌రెడ్డిని గెలిపిస్తే, సుధీర్‌రెడ్డి జాతకం మారింది కానీ జమ్మలమడుగు ప్రజల జాతకం మారలేదన్నారు. సుధీర్‌రెడ్డి ఇసుక దోపిడీ, గ్రావెల్ దోపిడీ, పరిశ్రమల నుండి నెలనెలా కమిషన్, వెంచర్లు వేసే వారి దగ్గర కమిషన్లు, ఉద్యోగస్తుల ట్రాన్స్‌ఫర్లలో కమిషన్, ఆఖరికి చీప్‌గా చికెన్ షాపులు, మినరల్ వాటర్ ప్లాంట్ల దగ్గర కూడా కమిషన్లు వసూలు చేస్తూ యాక్టర్ సుధీర్ రెడ్డిగా వుండిపోయాడన్నారు. ఆయన డాక్టర్ సుధీర్ రెడ్డి కాదు యాక్టర్ సుధీర్ రెడ్డి అన్నారు. ఈయనను చూసి సోలార్ కంపెనీలు, గండికోట రోప్ వే కంపెనీ వారు పారిపోయారన్నారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే స్టీల్ ప్లాంట్ కడతానని హామీ ఇచ్చాడు. రెండు సార్లు శంకుస్థాపన చేసాడే తప్ప పని ముందుకు సాగడం లేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే స్టీల్ ప్లాంట్ పూర్తి చేస్తాం. ఆర్టీపిపిలో కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చాడు. జీతాలు పెంచుతాం అని హామీ ఇచ్చారు గండికోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసింది టిడిపి అన్నారు. కొండాపురం మండలంలోని గండికోట పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు కల్పించింది వారికి పరిహారం అందిస్తామన్నారు. జమ్మలమడుగులో లోకేష్ భూపేస్‌ల జోడి అదరహో అని లోకేష్ అన్నారు. భూపేష్‌రెడ్డిని గెలిపించి బాబుకు టిడిపి పార్టీకి గిఫ్ట్‌గా ఇవ్వాలని కోరుతున్నానన్నారు.



బహిరంగ సభకు హాజరైన టిడిపి పార్టీ శ్రేణులు, ప్రజలు

అండగా ఉంటా ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వండి : భూపేష్‌రెడ్డి

నియోజవర్గ ప్రజలకు అండగా ఉండి కాపాడుకుంటానని ఎమ్మెల్యేగా గెలిపించి అవకాశం ఇవ్వాలని టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి అన్నారు. నియోజవర్గ సమస్యలను లోకేష్ దష్టికి తీసుకెళ్లారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తామని కోరారు. నియోజకవర్గంలో దేవగుడి కుటుంబం తప్ప మరొకరు అభివద్ధి చేయలేదని అభివద్ధి అంటేనే దేవగుడి కుటుంబమని సభ ముఖంగా తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు శివనాథ్‌రెడ్డి, రామగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు దేవగుడి నారాయణరెడ్డి, బిటెక్ రవి, పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు లింగారెడ్డి, టిడిపి నాయకులు సురేష్‌బాబు, నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు



కలెక్టరేట్ ఎఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పట్టణంలో బషీర్‌ఖాన్ పెట్రోల్ బంకులో క్లీన్ చేస్తుండగా ముగ్గురు కార్మికులు చనిపోయిన దుర్ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఎఒకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం బషీర్‌ఖాన్ పెట్రోలు బంకు యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ముగ్గురు కార్మికులు మృతి చెందిన సంఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించినా స్థానిక ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి స్పందించక పోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అధికార పార్టీకి చెందిన నాయకుల పెట్రోలు పంపు కాబట్టే కేసును పక్కదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్మికులు మృతి చెందిన సంఘటనలో బషీర్‌ఖాన్ పెట్రోలు పంపు యాజమాన్యం నిర్లక్ష్యం అడుగడుగునా కనపడుతున్నా హత్య కేసు నమోదు చేయకుండా ఐపిసి 174 పెట్టి కేసు నమోదు చేయడం అంటే నిందితులను కాపాడే ప్రయత్నం చేయడమే అని అన్నారు. అగ్నిమాపక శాఖ, పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖ అధికారుల అనుమతి లేకుండా, ఆక్సిజన్, నిచ్చెన, తాడు లేకుండా నైపుణ్యం లేని కార్మికులను 15 అడుగుల లోతులో ఉన్న ట్యాంక్‌లో ఎలా దింపుతారని ప్రశ్నించారు. ఇంత దుర్ఘటన జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలో జరిగితే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రమాదానికి కారణమైన వారిని తక్షణమే అరెస్టు చేసి, వారి కుటుంబాలకు ఎల్‌జి పాలిమార్స్ ఘటనలో ఇచ్చినట్లు రూ.కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ జోక్యం చేసుకుని దుర్ఘటనపై ఉన్నత స్థాయి అధికారులతో సమగ్రంగా విచారణ జరపాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బషీర్‌ఖాన్ పెట్రోలు పంపు దుర్ఘటనపై మానవహక్కుల సంఘానికి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి తదితరులకు లేఖ రాయడంతో పాటు వివిధ రాజకీయ పార్టీలు, సంఘాలను సమీకరించి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రామాంజులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బత్యాల చెంగల్రాయుడు

ప్రజా సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం :'బత్యాల'

రాజంపేట అర్బన్ : మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ మహానాడు వేదికగా రాష్ట్ర భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు మేనిఫెస్టో ప్రవేశ పెట్టారని మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు తెలిపారు. మంగళవారం నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ, యువకులు ఎదు ర్కొంటున్న సమస్యలతో పాటు నారా చంద్రబాబు నాయుడు బాదుడే బాదుడు కార్యక్రమం, ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి వెళ్ళినప్పుడు ప్రజల నుండి వచ్చిన ఎన్నో రకాల సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఆ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మేనిఫెస్టో తయారుచేసి ప్రకటించారన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ మహిళా అధ్యక్షులు కె.ఆర్.అనసూయదేవి, ఉపాధ్యక్షులు తాటి లక్ష్మీదేవి, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి సుజాత, అసెంబ్లీ అధ్యక్షురాలు షేక్ షర్మిల, పట్టణ అధ్యక్షులు మిరియాల నాగజ్యోతి, మందా శివ పార్వతి, సుబ్బలక్ష్మమ్మ, అరుణ, మిణుకు శాంతమ్మ, పల్లవి, వెంకటలక్షమ్మ, చిన్నక్క, నర్సమ్మ, పెంచలమ్మ పాల్గొన్నారు.



మహిళలకు చెక్‌ను అందజేస్తున్న కలెక్టర్, ఎస్‌పి

సారా రహిత జిల్లాగా మారుద్దాం

- కలెక్టర్ గిరీష, ఎస్పీ గంగాధరరావు

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య జిల్లాను నాటు సారా రహితంగా మార్చేందుకు జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ సమన్వయంతో కృషి చేస్తున్నట్లు కలెక్టర్ గిరీష, ఎస్పీ గంగాధరరావు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లో నాటు సారా నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ గిరీష మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో నాటు సారా నిర్మూలనకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయడం జరుగుతోందన్నారు. ఏడాది నుంచి నాటు సారా తయారు చేస్తున్న 200 మందిని గుర్తించి, వారిలో అవగాహన కల్పించి ఆ వృత్తి నుంచి వారిని బయటికి తీసుకువచ్చామని తెలిపారు. వారందరికీ వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా జీవనోపాధి మార్గాలకు సంబంధించి రుణాలు మంజూరు చేశామన్నారు. 120 మందికి ఉపాధి మార్గాలను చూపడం జరిగిందన్నారు. తాజాగా మరొక 40 మందికి ఉపాధి మార్గం కొరకు రూ 49.30 లక్షలు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. మదనపల్లిలో 15, పీలేరులో 15 చొప్పున ఎస్టీ తండాలకు చెందిన 30 కుటుంబాలు, వాయల్పాడులో 10 బిసి కుటుంబాలను గుర్తించి ఆర్థిక సహాయం అందజేస్తున్నామన్నారు. వీరందరూ తిరిగి అదే వృత్తిలోకి పోకుండా పోలీసు శాఖ వారు ఎప్పటికప్పుడు తగువిధంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. వీరందరి జీవనోపాధి మార్గాల కొరకు గొర్రెలు, బర్రెలు, ఆవులు, ఆటోలు తదితరాలకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా యంత్రాంగం ద్వారా వీరందరినీ సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌పి గంగాధరరావు మాట్లాడుతూ రాయచోటి, మదనపల్లిలలో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలు తరచూ తండాల్లోకి వెళ్లి నాటు సారా తయారు చేయకుండా అవగాహన కల్పించడంతోపాటు ఎక్కడైనా నాటు సారా తయారు చేస్తుంటే అలాంటి వారిపై ఉక్కు పాదం మోపడం జరుగుతోందన్నారు. మొదటిసారిగా కేసులు ఉన్న వారిని గుర్తించి వారికి ఇతర జీవన ఉపాధి మార్గాలను చూపి ఆ వృత్తి నుంచి బయటికి తీసుకురావడానికి అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. నాటు సారా తయారు చేసే వారిని గుర్తించడం జరుగుతోందన్నారు. నాటు సారా తయారీలో ఎక్కువ కేసులలో ఉన్నవారిపై పీడీ యాక్ట్‌తో పాటు జిల్లా బహిష్కరణ చేసే అధికారం కలెక్టర్ గారికి ఉందని రెండు అంతకంటే ఎక్కువ కేసులు ఉన్న వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించడం జరుగుతుందన్నారు. సారా నిర్మూలనలో భాగంగా 11 మంది పై జిల్లా బహిష్కరణ, నలుగురిపై పీడీ యాక్ట్ ప్రతిపాదించినట్టు తెలిపారు. అనంతరం నాటు సారా తయారీ నుంచి బయటికి వచ్చిన మదనపల్లి, పీలేరు వాయల్పాడుకి చెందిన 40 కుటుంబాలకు రూ.49.30 లక్షల చెక్కును కలెక్టర్, ఎస్పీ అందజేశారు.సమావేశంలో పోలీస్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఊటీకి ఆర్‌టిసి ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రముఖ పర్యాటక కేంద్రమైన ఊటీకి రెండో డిపో నుంచి జూన్ 2న ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేశామని డిపో మేనేజరు ఆర్సీ నిరంజన్ తెలిపారు. ఈ బస్సు జూన్ 2న రాత్రి 8 గంటలకు స్థానిక బస్టాండులో బయలుదేరి మైసూరు మీదుగా జూన్ 3న ఉదయానికి ఊటీకి చేరుకుంటుందని తెలిపారు. అనంతరం 4న ఉదయం ఊటీ నుంచి బయలుదేరి పైకార షఉటింగ్ స్పాట్, మధుమలై, బండిపూర అటవీ ప్రాంతం మీదుగా మైసూరుకు చేరుకుని అక్కడ ప్యాలెస్, జూ పార్కు, బృందావన్ గార్డెన్స్ చూశాక, అదే రోజు రాత్రి బయలుదేరి ఈ నెల 5న ఉదయానికల్లా మదనపల్లెకు చేరుకుంటుందని తెలిపారు. ఊటీకి వెళ్లదల చిన వారు డిఎం నంబరుకు ఫోన్లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.



స్టేడియం భూమి చదును పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

ముమ్మరంగా క్రికెట్ స్టేడియం పనులు : గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

క్రికెట్ స్టేడియం పనులను ముమ్మరం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ గిరీష ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని శివారు ప్రాంతమైన నక్కవాండ్లపల్లి సమీపంలో చురుగ్గా జరుగుతున్న క్రికెట్ స్టేడియం భూమి చదును పనులను క్షేత్ర స్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. క్రికెట్ పిచ్ ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారు, మట్టి చదును పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారు వాటి వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకొని త్వరగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. క్రికెట్ మైదానం పనులను ప్రాపర్‌గా చేయాలని సూచించారు. బోర్ వెల్ వేసి వారంలోగా వాటర్ సప్లై ఇవ్వాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇని ఆదేశించారు. క్రికెట్ స్టేడియంకు పవర్ సప్లై త్వరగా ఇవ్వాలని విద్యుత్ ఎస్‌ఇని ఆదేశించారు. అప్రోచ్ రోడ్డు, బిటి రోడ్డు పనులను కూడా పూర్తి చేయాలన్నారు. వంక ఆనుకొని కాంక్రిట్ రివిట్ మెంట్ పనులను కూడా చేయాలన్నారు. మైదానం చుట్టూ నీడని ఇచ్చే పెద్ద పెద్ద మొక్కలను నాటలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, కమిషనర్ గంగాప్రసాద్, విద్యుత్ ఎస్ఇ చంద్ర శేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ సి.ప్రసన్న కుమార్, ఆర్అండ్‌బి, రెవిన్యూ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

'భాష్యం'పై చర్యలు తీసుకోవాలి

రాయచోటి టౌన్ : నిబంధనలకు వ్యతిరేకంగా ముందస్తు అక్రమ అడ్మిషన్లపై, ఫీజుల దోపిడీకి ప్పాలడుతున్న భాష్యం పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఐఎఫ్ఎస్ అధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, ఐఎఫ్ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి శెట్టిపల్లి సాయి కుమార్ మాట్లాడుతూ మమ్మల్ని ఎవరేమి చేసుకుంటారంటూ కాలరేగుసుకొని విచ్చలవిడిగా ఫీజుల దోపిడీ చేస్తున్న భాష్యం స్కూల్ వైపు జిల్లా విద్యాశాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడం దారుణమని వాపోయారు. విద్యను భాష్యం స్కూల్ వ్యాపారంగా మార్చేసిందని వాపోయారు. అపద్దపు ప్రచారం చేస్తూ విద్యార్థులు తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. కాబట్టి తక్షణమే భాష్యం స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకొని స్కూల్ గుర్తింపు రద్దు చేయాలన్నారు. స్కూల్ బస్సులు సంబంధించి ఇక్కడ ఎటువంటి అనుమతులు లేకుండా గుంటూరు నుంచి తీసుకొచ్చి ఇక్కడ బస్సులు నడుపుతున్నా కనీసం బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు ఏమాత్రం పట్టించుకోవడం లేదని తెలిపారు. తప్పుడు ప్రచారాలతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ వేల రూపాయలు ఫీజులు కట్టించుకుంటున్న కనీసం అర్హత కలిగిన ఉపాధ్యాయులు కూడా లేకపోవడం దారుణం అన్నారు. భాష్యం స్కూల్ పైన చర్యలు తీసుకు నేంతవరకు దశలవారుగా పోరాట కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్ర మంలో ఎస్ఎఫ్ఐ, ఐఎఫ్ఎస్ భానుప్రకాష్, శివతేజ, నరేష్ ఉపేంద్ర పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

జనరంజకంగా జగన్ పాలన

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జనరంజకంగా సాగుతున్న జగన్ పాలనకు నాలుగేళ్లు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా వైసిపి కార్యాలయంలో ఎంఎల్ఎ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. మంగళవారం నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, మదనపల్లె పరిశీలకులు హాబీబుల్లా ఖాన్, ఫయాజ్ అహమ్మద్, రియాజ్ మాట్లాడుతూ మాట తప్పని, మడమ తిప్పని నేతగా, అన్ని వర్గాల వారికి చేరువై, ప్రజల ఆరాధ్యనాయకుడిగా సీఎం జగన్ పేరొందుతున్నారన్నారు. రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన హామీలను నాలుగేళ్ళ పాలనా కాలంలో తొంబై ఎనిమిది శాతంకు పైగా హామీలను నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్ ఖాన్, కౌన్సిలర్లు కొలిమి ఛాన్ బాష, గౌస్ ఖాన్, అల్తాఫ్, బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, సుగవాసి శ్యామ్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, కో ఆప్షన్ సభ్యులు అయ్యావారు రెడ్డి, హజరత్ ఖాదర్ వలీ, ఆసీఫ్ అలీఖాన్, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, అన్నా సలీం, నవరంగ్ నిస్సార్, రియాజుర్ రెహమాన్, మూసా, కొత్తిమీర ప్రసాద్, విక్కీ దేవేంద్ర, మల్ రెడ్డి పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం



రాయచోటి : జెండా ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

వర్గ పోరాటాలు విస్తృతంగా నిర్మించడం ద్వారానే కార్మిక వర్గ రాజ్యాధికారం సాధ్యమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు 53వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులతో కలిసి ఆయన సిఐటియు జెండా ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశ కార్మిక ఉద్యమ చరిత్రను సిఐటియు పాత్రను కార్మికులకు తెలియజేశారు. పీడిత, శ్రామిక జనాన్ని ఐక్యంగా ముందుకు నడిపిస్తున్న సిఐటియు పోరాటాల స్పూర్తితో నయాఉదారవాద ఆర్థిక విధానాలు. మతతత్త్వ కార్పొరేట్ శక్తులను కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను వ్యవసాయ నల్లచట్టాలు రద్దుకొరకు కార్మిక కర్షక ఐక్యతతో కార్మిక వర్గ రాజ్య స్థాపనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యుత్ కార్యాలయంలో యుఇఇయు ప్రధాన కార్యదర్శి ఎ.వి.రమణ, యుఇసిడబ్ల్యూయు సెక్రటరీ కె.సుబ్రహ్మణ్యం రాజు, గజాల నాగేశ్వర గౌడ్ జెండావిష్కరణ చేశారు. మున్సిపల్ కార్యాలయాల ఆవరణ జెండావిష్కరణ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు డి.విజయమ్మ, మున్సిపల్ యూనియన్ నాయకులు అగ్గిరామయ్య, రాంబాబు, వై.వెంకటరమణ, సిద్దయ్య, తిరుపాల్, మంగమ్మ, రాజమ్మ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** స్థానిక సిఐటియు ఆఫీసు వద్ద ఘనంగా ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. జెండాను జిల్లా కార్యదర్శి ప్రభాకరరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కుల సాధనకు సమస్యల పరిష్కారానికి వారి ఐక్యతా సాధనకే సిఐటియు ఏర్పటైందన్నారు. ప్రభుత్వాలను పెట్టుబడిదారులను ప్రయివేటు యజమానులను ఎదిరించి నిలబడిందన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు వెంకటేష్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు జయరాం, టాటాఏస్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, నాగరాజు, పవన్, శ్రీరాములు, రమణ పాల్గొన్నారు. రాజంపేట అర్బన్: సిఐటియు 54వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద సిఐటియు జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు నాయకులు ఎం.ఈశ్వరమ్మ, శివరంజని, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు లక్ష్మీదేవి, కార్మికులు ప్రసాద్, రవిశంకర్, విఆర్ఏ సంఘం నాయకులు శంకర్, సుబ్రహ్మణ్యం, ప్రసాద్ పాల్గొన్నారు.



రాజంపేట : జెండా ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న పి.రహిమాన్‌ఖాన్

సమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం..

ప్రజాశక్తి-సుండుపల్లి

ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం.. కార్యక్రమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైసిపి నాయకులు, జెసిఎస్ కన్వీనర్ పి.రహిమాన్‌ఖాన్ పేర్కొన్నారు. మండలంలోని సచివాలయం-3లో జగనన్నకు చెబుదామనే కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏవైనా సమస్యలుంటే వెంటనే ఫోన్ చేసి అధికారులు దృష్టికి తీసుకువెళ్లాలని, అధికారుల స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తారని చెప్పారు. అంతేగాకుండా ఆడ పిల్లలు ఏదైనా సమస్య వచ్చిన వెంటనే 100కు ఫోన్ చేసి పోలీసులు సమా చారమివ్వాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ సురేష్, రెవి న్యూ అధికారి విజయలక్ష్మి, ఇంజనీర్ అసిస్టెంట్ నరేష్, ప్రజలు రైతులు పాల్గొన్నారు.

కార్యకర్త మృతదేహానికి 'ఆర్‌ఆర్' నివాళి

ప్రజాశక్తి-రామాపురం

బండపల్లె పంచాయితీ బైనేని దళితవాడకు చెందిన టిడిపి కార్యకర్త రామాంజనేయులు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి వారి ఇంటికివెళ్ళి మృతదేహానికి నివాళులు అర్పించారు.ఆర్‌ఆర్ వెంట టిడిపి నాయకులు రామబసిరెడ్డి, గౌనిపల్లి కృష్ణ, సురేంద్ర, శ్రీనివాసులు, వెంకటేష్, సురేష్ రాయుడు పాల్గొన్నారు.



అంగన్వాడీ భవన నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలిస్తున్న ఎఇ నాగరాజు

అంగన్వాడీ భవన నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలో ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద చేపట్టిన అంగన్వాడీ భవన నిర్మాణాలను ఎఇ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. మండల పరిధిలోని వెంగమరాజుగారిపల్లె, జనార్దన్‌రెడ్డినగర్, తిమ్మసముద్రం, ఉర్దూపాఠశాల, ఆరోగ్యంపురం, శివరాంపురం అగ్రహారం పెద్ద బలిజబల్లి, రాచపల్లి అంగన్వాడీ కేంద్రాలలో జరుగుతున్న పనుల గురించి ఆరా తీశారు. భవన నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. నిర్మాణ పనులను ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని సంబంధిత అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ శేషగిరిబాబు

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- కలకడ

సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంక్రమిత అసంక్రమిత వ్యాధుల నివారణ జిల్లా అధికారి డాక్టర్ శేషగిరిబాబు సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పిహెచ్‌సి పరిధిలోని సచివాలయ సిబ్బంది, పిహెచ్‌సి వైద్యులు, ఎఎన్ఎంలు, వాలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం లోని ప్రతీ పౌరుడికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (అభాకార్డ్) అవసరం అన్నారు. ప్రజలు వారి సమీప సచివాలయంలో ఉన్న హెల్త్ సెక్రెటరీని కలసి వారి ఆధార్ నెంబర్‌తో లింక్ చేయించుకోవాలని సూచించారు. హెల్త్ ఐడి వల్ల ప్రతి పౌరుడికి ఒక నెంబర్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. వారి ఆరోగ్య పరిస్థితి అంతా అభాకార్డ్ లో నమోదు చేయబడుతుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రిలో కూడా ఈ నెంబర్ తీసుకుని వెళ్లి చూపించుకోవచ్చు.ఆరోగ్య శ్రీ కార్డ్‌తో ఐడి లింక్ చేయబడుతుందని తెలిపారు. అనంతరం వైద్యశాలలో సిబ్బంది హాజరు పట్టి, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ మోహన్, ఎంపిహెచ్‌ఒ వెంకటేశు, సూపర్వైజర్ వెంకట , వాలేంటీర్లు ,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షోభంలో సంక్షేమం : పిసిసి

వేంపల్లె : వైసిపి పాలన నాలుగేళ్లల్లో సంక్షేమం అనేది సంక్షోభంలో పడిపోయిందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి తెలిపారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి పాలన గురించి ఒక ముక్కలో చెప్పాలంటే రాక్షస పాలన లేక ప్రజా కంటక పాలనగా చెప్పవచ్చన్నారు. వ్యవసాయ ప్రధానమైన రాష్ట్రంలో వ్యవసాయ, సాగునీటి రంగాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. దీని పర్యవసానంగా రైతులు, కౌలురైతుల ఆత్మహత్యలు పెరిగినట్లు చెప్పారు. భూమి, ఇసుక, మద్యం, గనులు, ఎర్రచందనం, ఎర్రమట్టి, బియ్యం మాఫియా రాజ్యమేలుతున్నట్లు విమర్శించారు. రాష్ట్రంలో గన్ కల్చర్, గంజాయి కల్చర్ పెరిగిపోయినట్లు తెలిపారు. నాలుగేళ్ల కిందట రావాలి జగన్, కావాలి జగన్ అన్న ప్రజలే నేడు పోవాలి జగన్, వద్దు జగన్ అంటున్నారని అన్నారు.

గాలివానతో మామిడికి తీవ్ర నష్టం

ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి-సుండుపల్లె

మండలంలో రెండు రోజుల్లో కురుస్తున్న గాలి, వానకు మామిటి పంటకు తీవ్ర నష్టం వాటిల్లడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మంచి దిగుబడి వస్తుందని ఆశించిన మామిడి రైతులకు నిరాశే మిగిలింది. గాలివాన బీభత్సంతో చెట్లు నేలకొరిగి మామిడి కాయలు నేలరాలాయి. మామిడి చెట్ల కోసం పెట్టినటువంటి పెట్టుబడి కూడా ఈ సంవత్సరము రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్లకు వేలాది రూపాయలు ఖర్చుపెట్టి మందులు కొట్టామని కనీసం ఆ మందులకు ఖర్చు పెట్టిన డబ్బులు కూడా రావని ఆందోళన చెందుతున్నారు. రాలిపోయిన కాయలను మండిలో కూడా తీసుకోరని ఇవి కూడా పారవేయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నష్టం వాటిల్లిందని వాపోతున్నారు. దీనిపైన ఉన్నతాధికారుల స్పందించి జరిగిన నష్టాన్ని పరిశీలించి, ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా కృషి చేయాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సర్వే చేయించి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



గాలివానకు నేలరాలిన మామిడి కాయలు

పిడుగుపాటుకు 15 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలను చూపుతున్న బాధిత రైతు

ప్రజాశక్తి-ములకలచెరువు

మండల పరిధిలోని పెద్దపాలెం దర్గా సమీపంలో మంగళవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసి పిడుగులు పడ్డాయి. పిడుగుపాటుకు గ్రామానికి చెందిన ఎస్.సయ్యద్ బాషా కుమారుడు ఎస్.అల్లాబకాష్ గొర్రెలను మేపు కోసం గ్రామ శివారులోని పొలాల్లోకి తీసుకెళ్లగా వర్షంతో పాటు పిడుగు పడటంతో 15 గొర్రెలు మృత్యువాతపడ్డాయి.పిడుగుపాటు ధాటికి పొలంలో మేపుకు వెళ్లిన గొర్రెలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ప్రకృతి ప్రకోపానికి ఒకేసారి 15 గొర్రెలు మృతి చెందడంతో వాటితోనే జీవనం సాగిస్తున్న రైతు అల్లాబకాష్ తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. వాటి విలువ సుమారు రూ.180లక్షలు విలువ ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం తనకు ఆదుకోవాలని అధికారులను కోరారు.

పిహెచ్‌సిలో జెసి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-వీరబల్లి

మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి, అంగన్వాడీ కేంద్రాన్ని మంగళవారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి పలు వైద్య సమస్యలపై చర్చించారు. మండలంలోని ప్రజల్లో చాలా వరకు రక్తహీనత ఉందని వైద్యులు జెసి దృష్టికి తీసుక వచ్చారు. రక్తహీనత నుంచి ప్రజలకు కాపాడేందుకు సరైన వైద్యం, సలహాలను అందించాలని సూచించారు. ప్రభుత్వ వైద్యరంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఆస్పత్రిలో ప్రజలకు కావాల్సిన సౌకర్యాలు కల్పించడమే కాకుండా, వైద్య పరీక్ష లతో పాటు మందులు కూడా సరఫరా చేస్తోందని అన్నారు. ఒపి రికార్డు లను పరుశీలించారు. అనంతరం మండల కేంద్రంలో ఉర్దూ పాఠశాల వద్ద ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న అంగన్వాడీ సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న విలువైనా పౌష్టిక ఆహారాన్ని గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని సూచించారు. అనం తరం ఆయన సానేపాయి అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ కొండయ్య తహశీల్దార్ తులసమ్మ, వైద్యాధికారులు వినయ్‌బాబు, మనీషా, ఎంపిడిఒ మల్లేశ్వరి, వైద్య, రెవెన్యూ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న జెసి

పకడ్బందీగా విద్యా కానుక అమలు : ఎంఇఒ



బ్యాగుల నాణ్యతను పరిశీలిస్తున్న ఎంఇఒ రంగనాథయ్య

ప్రజాశక్తి - పుల్లంపేట

జగనన్న విద్యా కానుకల్లో ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా పకడ్బందీగా అమలు చేస్తున్నామని ఎంఇఒ రంగనాథయ్య తెలిపారు. మంగళవారం నాడు ఆదర్శ పాఠశాలలో భద్రపరచిన బ్యాగుల నాణ్యతను పరిశీలించినట్లు తెలిపారు. పాఠశాలల ప్రారంభం నాటికి పాఠశాలలకు అందించాలనే లక్ష్యం ప్రభుత్వం పెట్టుకుందన్నారు. బ్యాగుల నాణ్యతను ఎంఇఒ పరిశీలించడం జరిగిందని తెలిపారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పాఠశాల ప్రారంభం లోనే జగనన్న విద్యా కానుక అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో శివప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ ఖాసీం, సిఆర్‌పిలు లీల కృష్ణయ్య, చిన్నమనెమ్మ పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-పీలేరు

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పీలేరులో మహిళలు పాలాభిషేకం చేశారు. మహానాడు వేదికగా టిడిపి అధినేత చంద్రబాబు ఎన్నికల శంఖారావం పూరిస్తూ మహాశక్తి, ఇంటింటికి నీరు, పూర్‌టురిచ్, బిసిలకు రక్షణ చట్టం, అన్నదాత, యువగళం పేరుతో మేనిఫెస్టో ప్రవేశపెట్టడాన్ని హర్షిస్తూ మంగళవారం పీలేరు పట్టణంలోని బండ్లవంక 4వ వార్డులో మహిళలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఆదేశాలమేరకు చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ సంపద సృష్టిస్తూ, రాష్ట్ర ఆదాయాన్ని పెంచుతూ, ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ ఖచ్చితంగా అమలు చేసే సమర్ధ పరిపాలనా అనుభవం ఒక్క చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని వారన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వం వర్ధిల్లాలి, సైకోపోవాలి - సైకిల్ రావాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి కార్యదర్శి పురం రామ్మూర్తి, పీలేరు మండల మండల అధ్యక్షురాలు పురం రెడ్డెమ్మ, మండల మాజీ అధ్యక్షులు ఎన్ ఆమర్నాథ రెడ్డి, శేఖర, వైన్స్ ఖాదర్, స్వర్ణ,తేజ, చందన, ప్యారీజాన్, రెడ్డిరాణి సుబ్బు పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు



ఇంటింటా ప్రచారంలో గోసాలదేవి

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

ప్రజాశక్తి-పుల్లంపేట

కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి గోసాలదేవి పేర్కొన్నారు. మండల పరిధిలోని రంగంపల్లె పంచాయతీ ఆర్‌రాచపల్లి గ్రామంలో మంగళవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ కన్వీనర్ నల్ల కదిరిగాళ్ల శాంతయ్య ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోసాలదేవి మాట్లాడుతూ రాష్ట్ర పిసిసి ప్రెసిడెంట్ గిడుగు రుద్రరాజు ఆదేశాల మేరకు నియోజవర్గంలో ప్రతి గడపగడపకు తిరిగి కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. దేశంలో 2024 ఎన్నికల్లో మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే సామాన్య ప్రజలు బ్రతుకుతారని, ప్రతి చేయి చేయి కలిపి కలసికత్తుగా పనిచేసే రాహుల్ గాంధీ నాయకత్వం బలపరచాలని కోరారు. కార్యక్రమంలో పుల్లంపేట మండల అధ్యక్షుడు సిగమాల రమేష్, రవి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలపై అవగాహన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో భాగంగా మంగళవారం పిల్లలకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. దాదాపు 25 మంది పిల్లలు హాజరైనట్లు గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ ఉమా దేవి తెలిపారు. ముఖ్య అతిథిగా జెవివి జిల్లా కార్యదర్శి, ప్రముఖ మెజీషియన్ సుజన్‌కుమార్ పిల్లలకు మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు. అనంతరం మ్యాజిక్ షో చేసి పిల్లలను అలరించారు.

రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచాలనుకోవడం దుర్మార్గం

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి ప్రభుత్వం మరోసారి రిజిస్ట్రేషన్ల ఛార్జీలను పెంచాలనుకోవడం దుర్మార్గమని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, టిడిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో టిడిపి నాయకులు పివి రమణ, మైనార్టీ మండల ప్రధాన కార్యదర్శి మాబు షరీఫ్, గొటూరు నాగ భూషణం, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నష్టపోయిన కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని సుండుపల్లె గ్రామపంచాయతీలో రెండు రోజులు కురిసిన వర్షానికి నష్టపోయిన కుటుంబాలకు యువనాయకుడు మేడా విజయ్‌శేఖర్‌రెడ్డి తన సొంత నిధులతో ఆర్థిక సహాయం అందించారు. కూలిన ఇళ్ల గోడలను, ఇంటిపైకప్పులు లేచిన పోయిన కుటుంబాలను పరామర్శించి వాటి మరమ్మతుల కోసం ఆర్థిక సాయం అందించారు. రోడ్లు, డ్రైయినేజీ కాలువలను, విద్యుత్ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బండిఈశ్వర్, దళిత నాయకుడు రామచంద్ర, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న మేడా విజయ్‌శేఖర్ రెడ్డి



అధికారులకు శిక్షణ ఇస్తున్న ఎంపిడిఒ గంగయ్య

ఫిర్యాదుల పరిష్కారంపై శిక్షణ

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారులకు ఎంపిడిఒ గంగయ్య ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాల ఫిర్యాదుల పరిష్కారంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ గంగయ్య మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం స్పందన, కార్యక్రమాలపై వచ్చే ఫిర్యాదుల సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలి, ఎంత సమయంలోపల పరిష్కరించాలనే దానిపై శిక్షణ కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులకు, గ్రామస్థాయి కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ సుజాత, ట్రాన్స్‌కో ఎఇ రెహమాన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ లీనా కుమారి

వెలుగు పాఠశాలలో ప్రపంచ 'మల్టిపుల్ స్క్లెరోసిస్‌డే'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండల పరిధిలోని కోళ్లబైలు పంచాయతీ, అమ్మచెరువు మిట్ట వెలుగు సంస్థలో మినిస్ట్రీఅఫ్ సోషల్ జస్టిస్ దీన్ దయాల్ డిసబ్లెడ్ వెలుగు సంస్థలో నేషనల్ ట్రస్ట్ వారి ఆదేశాల మేరకు ప్రపంచ మల్టిపుల్ స్క్లెరోసిస్ డే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెలుగు ప్రిన్సిపల్ పి.లీనా కుమారిని వెలుగు సిబ్బంది స్వీటీ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరల్డ్ మల్టిపుల్ స్క్లెరోసిస్‌డేను మే 30వ తేదీన జరుపుకుంటున్నామనీ, ఈ మల్టిపుల్ స్క్లెరోసిస్ అనేది మెదడు, వెన్నెముక, కళ్ల నరాలను దెబ్బతీసే ఓ దీర్ఘకాలవ్యాధి అని, దీని ప్రారంభ లక్షణాలు బలహీనత, జలదరింపు, తిమ్మిరి, దృష్టి మసకబారడం వంటివి ఉంటాయని అన్నారు. మే 30న ప్రపంచ మల్టిపుల్ స్క్లెరోసిస్ డేను జరుపుకుంటున్నామని అన్నారు. ఈ వ్యాధి బారిన వారు మానసిక నిపుణుల సలహాలను పాటిస్తూ, వారు ఇచ్చే మందులను క్రమం తప్పకుండా వాడాలని తెలిపారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ ఎం.గీత, శాంతి, వృద్దులు, పిల్లలు పాల్గొన్నారు.



సమ్మర్ స్టోరేజ్ మొరవను పరిశీలిస్తున్న జనసేన పార్టీ నాయకులు

సమ్మర్ స్టోరేజ్ పనులు పూర్తిచేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలం చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ మొరవను, చెరువును జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం సమ్మర్ స్టోరేజ్ పనులను పూర్తి చేయలేదని తీవ్రంగా మండిపడ్డారు. హంద్రీనీవా నీటిని ఈ సమ్మర్ స్టోరేజ్ లో స్టోరేజ్ చేసి మదనపల్లి దాహార్తిని తీర్చవచ్చుని, ఈ చేత కానీ ప్రభుత్వం వలన మొరవ పని పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి అందరూ కలసి మొరవ పని పూర్తి చేసి, వర్ష కాలంలో నీటిని స్టోరేజ్ చేసి మదనపల్లి దాహార్తి తీర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం రాయల్, రాష్ట్ర చేనేత విభాగ నాయకులు అడపా సురేంద్ర, ఐటి విభాగ నాయకులు జగదీష్, మదనపల్లి మండల రూరల్ అధ్యక్షులు గ్రానైట్ బాబు, జనార్ధన్, సనావుల్లా, రెడ్డమ్మ, నాగ, నగేష్, నవాజ్, మోహన, శేఖర,వేణు, మాధవ్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడమే తమ లక్ష్యమని జిఆర్‌టి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పద్మరాణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 140 సంవత్సరాల చరిత్ర కలిగిన పాఠశాలకు మళ్లీ పూర్వవైభవం తీసుకురావడానికి చర్యలు చేపట్టామన్నారు. విశాలమైన తరగతిగదులు, అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే విద్యాబోధన, దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం, ఆంగ్లంపై పట్టు సాధించేందుకు స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. తెలుగు మీడియం పాఠశాల అయినప్పటికి, ఇంగ్లీషులో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహాయ, సహకారాలు అందివ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఇకపోతే జూన్ 4వ తేదీన పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళ నం ఏర్పాటు చేస్తున్నామన్నారు. గతంలో పాఠ శాలలో చదివిన పూర్వ విద్యా ర్థులందరూ తప్పక హాజరై,తమ అమూ ల్య మైన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఇప్పటికే పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు పాఠశాల ప్రాముఖ్యత, ఇక్కడ ఉన్న సౌకర్యాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి పప్పు విజయ్ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి జి.లేపాక్ష, కమిటీ సభ్యులు వి.ఎస్.మురళి మోహన్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఓ వ్యక్తిని మంగళవారం పిటిఎం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ రవీంద్రబాబు కథనం మేరకు వివరాలు.. కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై అందిన ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. మండలంలోని తుమ్మరగుంట పంచాయతీ, కాపుపల్లి దగ్గర కర్ణాటక రాష్ట్రం ఎనుగుదల వైపు నుంచి అడ్డదారిలో బూర్లపల్లి వైపుగా బూర్లపల్లెకి చెందిన చిన్నగూటం గంగప్ప కుమారుడు చిన్నగూటం నరేష్ (29) అనే వ్యక్తి రూ.3161 లు విలువ చేసే హైవార్డ్స్ చీర్స్ విస్కీ 90 ఎంఎల్ పరిమాణం కలిగిన 90 మద్యం ప్యాకెట్లు తరలిస్తుండగా అదుపులోకి అరెస్టు చేసినట్లు తెలిపారు.

తల్లి బిడ్డ అదృశ్యం : కేసు నమోదు

ప్రజాశక్తి -కలికిరి

తల్లి బిడ్డ అదృశ్యమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు కలికిరి మండలం, మద్రికుంటపల్లి, పాత దళితవాడచెందిన, పల్లవి (25) తన భర్త మల్లికార్జునపై మనస్పర్థలతో వారి కుమారులు (ఓంప్రధీప్), అభిలాష్(5)లతో పాటు 28వ తేదీ సాయంత్రము ఇంటి నుంచి వెళ్లిపోగా, అప్పటి నుండి వారి కోసము ఎంత వెతికిన ఆచూకీ దొరకక పోవడంతో మల్లికార్జున పోలీస్ స్టేషన్‌లో తన భార్య, బిడ్డల అదృశ్యం పై ఫిర్యాదు ఇవ్వగా కలికిరి ఎస్ఐ ఎస్.కే.రహీముల్ల ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ మురగేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.